క్లుప్తంగా

నీటి సమస్యను పరిష్కరిస్తాం

సాక్షి ఎఫెక్ట్

ఫిరంగిపురం: ఫిరంగిపురం గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో నీటి విడుదల సమయంలో ఉన్న లీకేజీలు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని ఈవో ఏకే బాబు తెలిపారు. సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురించిన 'నీరు తాగలేం.. వాడుకోలేం' అనే శీర్షిక కథనానికి అధికారులు బుధవారం స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నీటి నమూనాలు సేకరించి వాటిని జిల్లా కేంద్రంలోని నీటి పరీక్షలు చేయించినట్లు తెలిపారు. నీరు తాగేందుకు వీలుగా ఉన్నట్లు వివరించారు. లీకేజీల వల్ల కలుషితం కాకుండా వాటిని గుర్తించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

13న లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఫిరంగిపురం: గుంటూరులోని కోర్టు ప్రాంగణంలో ఎస్‌బీఐ సౌజన్యంతో శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో క్రాఫ్, ముద్రలోన్లు తీసుకున్న లబ్ధిదారులు వినియోగించుకోవాలని సొలస బస్టాండ్ సెంటర్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ బి.మణిప్రసాద్ బుధవారం తెలిపారు. లోన్లు తీసుకున్నవారు చెల్లించకుండా ఉన్నవారు లోక్ అదాలత్‌కు హాజరై (ఒన్ టైం సెటిల్ మెంట్) ఒకేసారి నిర్ణీత ధనం చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదాలత్ నిర్వహిస్తారన్నారు.

వీజే కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



మంగళగిరి, మంగళగిరి టౌన్: వీజే కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బీవీఎల్ ఆరాధ్య శర్మ నాగార్జున విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పొందడం అభినందనీయమని వీజే కళాశాల కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ కొనియాడారు. నగర పరిధి ఆత్మకూరులోని కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆరాధ్య శర్మ డాక్టరేట్ పొందిన సందర్భంగా కళాశాలలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. ముగిల్ సెఫాలస్ యొక్క జీవ శాస్త్ర, బయోకెమికల్ పరిశీలనలకు కృష్ణా ఎస్ట్యూరీ నుంచి ముల్లెట్ ఫిషరీపై లోతైన పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్‌మెంట్, సహచర అధ్యాపకులు శర్మకు అభినందనలు తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నులకపేట వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ.. పెదకాకాని గ్రామ పంచాయతీ మహిళా కార్మికులను కులం పేరుతో దూషించి, దాడిచేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని అన్నారు. వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు సంతోషం, సువార్త, రాంబాబు, రాణి, అనూష, బాబ్జి, సీమోను, శశికళ, కొండయ్య, విమల తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు



తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగులు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ తెనాలి నాయకులు డిమాండ్ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్‌ను తన కార్యాలయంలో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యోగులందరు సమ్మెలోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోండి

తెనాలిఅర్బన్: కమ్యూనికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులు పెంపొందించుకోవాలని ఐబీఎం సంస్థ ప్రతినిధి అశ్విని కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో బుధవారం స్కిల్ డెవలప్ మెంట్‌పై వర్క్ షాపును నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ శాంత కుమారి, ప్లేస్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు ప్రసన్న కుమార్, మణికంఠ గోపాల్ పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు చర్యలేవి!



దస్ట్ వేసి వదిలేయడంతో దుమ్ములేస్తున్న రహదారి



ప్రమాదకరంగా తాడికొండ-కంతేరు మధ్య ఉన్న రహదారి మార్జిన్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవీటి వాగు ఉప్పొంగి రహదారి గుంతలమయంగా మారింది. దీంతో తాడికొండ-కంతేరు మధ్య రోడ్డు మార్జిన్లు భారీగా కొట్టుకుపోయి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అసలే సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదకర మార్జిన్లు వాహనదారులు, ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారాయి. వరద తగ్గి నెల రోజులు దాటినా దీనిపై సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని వాహన చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు కనీస మరమ్మతులు నిర్వహించి సమస్య తొలగించాలని పలువురు కోరుతున్నారు. – తాడికొండ

పంచాయతీ రోడ్లపై మురుగు

మేడికొండూరు నుంచి మంగళగిరిపాడు, తురకపాలెం, డోకిపర్రు వెళ్లే ప్రధాన పంచాయతీ రహదారిపై నిత్యం మురుగు ప్రవహిస్తోంది. పంచాయతీ అధికారుల అలసత్వంతో మురుగు కాలువల నిర్వహణ లోపం వల్ల కాలువల్లో ప్రవహించాల్సిన మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ఫలితంగా సమీప నివాస గ్రామాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. మురుగు సమస్యపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – మేడికొండూరు



తురకపాలెం రోడ్డులో నిలిచిన మురుగు

వీరనారి చిట్యాల ఐలమ్మ



ఐలమ్మ, రామకృష్ణ చిత్రపట వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వీరనారి చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతిని బుధవారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో తాడేపల్లిలోని చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపం వద్ద నిర్వహించారు. ముందుగా చిట్యాల ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి పీడిత ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి, వారిని ఏకం చేసిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని అన్నారు. 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరెంటు చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా జరిగిన విద్యుత్ పోరాటంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేస్తూ అమరుడైన అమరజీవి సత్తెనపల్లి రామకృష్ణ పోరాటం, ప్రాణ త్యాగ నిరతి నేటి రజక సోదరులకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, సంఘం మంగళగిరి తాడేపల్లి నగర అధ్యక్ష కార్యదర్శులు ఉండవల్లి పార్థసారథి, పాగోలు శ్రీనివాసరావు, సంఘం నాయకులు తాడేపల్లి సాంబశివరావు, సర్వేపల్లి శివయ్య, ధరణికోట వీరాంజనేయులు, ఉండవల్లి దుర్గారావు, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి



నిరసన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, రవి

తాడికొండ: రాజధాని పారిశుద్ధ్య కార్మికుల రెండు నెలల పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి డిమాండ్ చేశారు. జీతాల చెల్లింపు కోరుతూ రాజధానిలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరసన బుధవారంతో 3వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధాని పారిశుద్ధ్య కార్మికుల ఆకలి కేకలు పాలకులకి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకపోగా.. ఇచ్చే అరకొరా జీతాలు కూడా నెలలు తరబడి పెండింగ్ ఉంచడం సరికాదన్నారు. పెదకాకానిలో మహిళా పారిశుద్ధ్య కార్మికులపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షురాలు సీహెచ్ సుశీల, సంఘం నాయకులు పి.రత్నకుమారి, వి.అరుణ, మార్తమ్మ, భూలక్ష్మీ, జ్యోతి, మాలతి, ముత్యాలు, తిరుపతమ్మ, కోటేశ్వరి, దుర్గ, సీఐటీయూ నాయకులు కుంభ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవసరాల మేరకు యూరియా పంపిణీ



ఎరువుల పంపిణీ కేంద్రం ప్రారంభిస్తున్న హరిబాబు

తాడికొండ: జిల్లాలో యూరియా కొరత లేకుండా రైతుల అవసరాల మేరకు అన్ని శాఖల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు. బుధవారం తాడికొండ మార్కెట్ యార్డు ఆవరణలో ఆయన చేతుల మీదుగా ఎరువుల పంపిణీ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. తాడికొండ శాఖలో ప్రస్తుతం డీఏపీ 20 టన్నులు, యూరియా 20 టన్నులు నిల్వ ఉంచామని.. రైతులకు అవసరమైన అన్ని రకాలైన ఎరువులు అందజేస్తామని తెలిపారు. మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా 603.6 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ గుంటూరు జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, తాడికొండ మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ గోగినేని శ్రీనివాసరావు, నీలాల కృష్ణారావు స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బడేపురం ఆలయ రహదారి సమస్యకు వీడని చిక్కుముడి


ఇరు వర్గాలతో భేటీ అయిన ఆర్డీవో, డీఎస్పీ, సీఐ, తహసీల్దార్‌లు



అభిప్రాయాలు తెలియజేస్తున్న గ్రామస్తులు

తాడికొండ: తాడికొండ శివారులో కొండపై నిర్మించిన ఆలయాలకు వెళ్లే రహదారి సమస్య చిక్కుముడి వీడలేదు. బుధవారం ఎస్సీ, ఓసీ ఇరువర్గాలతో బడేపురంలో ఆర్డీవో శ్రీనివాసరావు సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశంలో ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఆలయానికి వెళ్లే రహదారికి రోడ్డు సౌకర్యం కల్పిస్తూ ఎస్సీలు మరో దారిని ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలియజేయడంతో వారు ససేమిరా అన్నారు. గతంలో నుంచి తాము వెళుతున్న మార్గాన్ని మాకు కేటాయించాలని కోరారు. తమపై వివక్షతో ఆలయానికి వెళ్లే మార్గాన్ని లాక్కోవాలని చూస్తున్నారని తెలిపారు. అధికారులు సమస్య పరిష్కారం చూపకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఓసీ సామాజిక వర్గానికి మొగ్గు చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాలతో పాటు అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, తహసీల్దార్ మెహన్ కుమార్, సీఐ కె.వాసు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక గ్రామోత్సవంలో ఉద్రిక్తత



వినాయక విగ్రహ గ్రామోత్సవం..



వినాయక విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెంలో బుధవారం జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఉద్రిక్తత నెలకొంది. శ్రీ బాబాగణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ఊరేగింపు ట్రాక్టర్‌పై వినాయక విగ్రహంతో పాటు పోలీసులు జారీ చేసిన నోటీస్ ఫ్లెక్సీ ఉద్రిక్తతకు తలెత్తాయి. పోలీసుల అత్యుత్సాహంపై కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. వినాయక విగ్రహ ఉత్సవాల సందర్భంగా ఏ ఒక్క విగ్రహానికి లేని నిబంధనలు తమ విగ్రహ ఊరేగింపులో మాత్రమే విధించడమేమిటని నిలదీశారు. గ్రామంలో ఊరేగించిన వినాయక గ్రామోత్సవాలలో 90 శాతం విగ్రహాల వద్ద డీజేలు, తీన్మార్ డప్పులు వాయించారని, తమకు చిన్నపాటి మేళానికి కూడా అనుమతి ఎందుకు ఇవ్వరని పోలీసులను నిలదీశారు. చట్టాన్ని గౌరవిస్తూ తాము నిమజ్జన ఉత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.

తెనాలి రోడ్డు విస్తరణ బాధితుల హక్కుల పరిరక్షణకు కమిటీ

మంగళగిరి టౌన్: తెనాలి రోడ్డు విస్తరణ బాధితుల హక్కుల పరిరక్షణ కోసం, వ్యాపార పరిరక్షణ, చేనేత, రోడ్డు విస్తరణ బాధితులు బుధవారం కొత్తరామాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బాధితుల హక్కులను కాపాడుకునే ఉద్దేశ్యంతో బాధితుల హక్కుల పరిరక్షణ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ కన్వీనర్‌గా జొన్నాదుల గురుమోహనరావు, కో-కన్వీనర్లుగా వీరాస్వామి, తిలార్, సభ్యులుగా సాంబశివరావు, నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, పోతురాజు, మహమ్మద్ అలీ, శ్రీనివాసరావులు ఎంపికయ్యారు. బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూడడమే కమిటీ లక్ష్యమని కన్వీనర్ గురుమోహనరావు తెలిపారు.

రేషన్ కార్డుల్లో తప్పులు

ఆత్మకూరు(మంగళగిరి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ కార్డులలో పేర్లు తప్పులు ఉన్నాయని.. వాటిని ప్రభుత్వం ఉచితంగా సరి చేసి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం బృందం నగర పరిధి ఆత్మకూరులో పర్యటించి రేషన్ కార్డుల పంపిణీని పరిశీలించింది. కార్డులలో పలు తప్పులు ఉన్నాయని లబ్ధిదారులు సీపీఎం దృష్టికి తీసుకువచ్చారు. తప్పులను వెంటనే ప్రభుత్వమే సరిచేసి పంపిణీ చేయాలని నేతాజీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు వుద్దంగి దుర్గారావు, గద్దం అజయ్‌కుమార్, చిట్టేల సీతారామాంజనేయులు, చింతలచెరువు జాను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకోవాలి



తాడేపల్లి రూరల్: విద్యార్థులు ఆత్మ పరిశీలన చేసుకుని.. తనకు తానుగా మానసిక ప్రేరణ పొందాలని సింగపూర్‌నకు చెందిన ప్రముఖ బౌద్ధ మత గురువు సింఘ థెక్‌చెన్ నమ్‌డ్రోల్ రిన్పోచే అన్నారు. బుధవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మానసిక ఆరోగ్యం, జీవన విలువలు, ఆత్మపరిశీలన వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. వర్సిటీ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ పి.సాయివిజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గురువుల నుంచి పాఠాలు అందించేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకటరామన్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలు వేయొద్దు

తెనాలిఅర్బన్: కాల్వల్లో వ్యర్థాలు వేయటం వల్ల పారుదల నిలిచిపోతుందని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు పేర్కొన్నారు. 17వ వార్డులో బుధవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అనేక కాల్వల్లో ప్రతిరోజు వ్యర్థాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ఇలా చేయటం వల్ల దోమల వ్యాప్తి కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ఎవరు కాల్వల్లో వ్యర్థాలు వేయవద్దని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ దోమల వల్ల అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టుకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కాల్వల్లో స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలి



మంగళగిరి టౌన్: ఆశా వర్కర్ల వేతనాల పెంపునకు ఉద్యమం చేస్తామని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ అన్నారు. నగర పరిధి సీఐటీయూ కార్యాలయంలో బుధవారం యూనియన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు అనేక పోరాటాలు చేసి జీవో నెం.94ను సాధించుకున్నారని పేర్కొన్నారు. వేతనాలు పెంచి ఆరేళ్ల పైనే అయ్యిందని, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం ఆశా వర్కర్ల యూనియన్ పట్టణ కమిటీ 11 మందితో ఎంపిక చేశారు. అధ్యక్షురాలుగా మహాలక్ష్మి, కార్యదర్శిగా శ్రావణి ఎంపికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించడం ఆపాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

తాడేపల్లి రూరల్: పారిశుద్ధ్య కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించడం ఆపాలని సీఐటీయూ తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులో పారిశుద్ధ్య కార్మికుల విస్తృత సమావేశాన్ని సంఘం అధ్యక్షులు చొక్కా మరియదాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. వీధులను శుభ్రం చేస్తూ, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించడం ప్రభుత్వం మానుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన ఒప్పందం ప్రకారమే ఆప్కాస్‌ను తొలగించకుండా కార్మికులను కొనసాగించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా వారిని గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులపై అధిక పని భారం వేయకుండా, అవసరమైన చోట కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుల ప్రాతూరు గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ప్రాతూరు నాగేశ్వరరావు, కార్యదర్శిగా సిద్దెల ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా హనుమంతరావు, కోశాధికారిగా రవికుమార్‌లు ఎన్నికయ్యారు.

కేఎల్‌యూలో అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ దినోత్సవం



అవగాహన ర్యాలీలో కేఎల్‌యూ ఆచార్యులు, విద్యార్థులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బుధవారం అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్యూ ఎడ్యుకేషన్ సెల్, ఎఫ్‌ఈడీ, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ.. జీవితంలో ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, ప్రతి అపజయం మరో గొప్ప విజయానికి పునాది అని అన్నారు. వాల్యూ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. మానవ జీవితం అందమైనదని, చిన్నచిన్న పొరపాట్లకు కృంగిపోకుండా వాటిని సరిచేసుకుంటూ ముందుకు వెళ్లాలని, ఆవేశపూరితమైన నిర్ణయాలు మంచివి కావని సూచించారు. అనంతరం అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా జరిగిన పోస్టర్ల ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకటరామన్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ శ్రీధర్, కన్వీనర్ ఎ.భాను ప్రియాంక, కార్యక్రమ కోఆర్డినేటర్ ఎ.వి జయరత్నం, కార్యక్రమ డైరెక్టర్ శంకరి, సైకాలజిస్టులు రాజేశ్వరి, శిరీష, శ్రీనాద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిస్టర్ నిర్మల జ్యోతి

ఆత్మకూరు(మంగళగిరి): పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నిర్మల ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి పేర్కొన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో బుధవారం విజయవాడ వాసవ్య మండలి విజయవాడ, ఆస్ట్రేలియా కాన్సులేట్ సహకారంతో రాష్ట్రంలో మహిళలకు సోలార్ టెక్నీషియన్ ఉచిత శిక్షణ అవకాశం కల్పించారు. అందులో భాగంగా కళాశాలలో 14 రోజుల తొలి బ్యాచ్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిస్టర్ మాట్లాడుతూ.. సమాజంలో మగవారు చేయగలిగిన పని ఏదైనా స్త్రీలు కూడా చేయగలరని అన్నారు. వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బొల్లినేని కీర్తి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సోలార్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని, సోలార్ విద్యుత్ వాడకం పెరిగేలా ప్రోత్సహకాలు కేంద్ర ప్రభుత్వం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన వంటివి వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాములరెడ్డి, మహిళా సెల్ కోఆర్డినేటర్ రత్న మంజుల, ఎన్ఎస్ఐసీ సభ్యులు రాబిన్ జేమ్స్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు బుధవారం 281వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు స్టీవెల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు షేక్ సుభాని, సాంబశివరావు, అంకయ్య, నాగేశ్వరరావులు.. కార్మికులు సుబ్బారావు, ఆశీర్వాదం, వెంకటేశ్వర్లు, రమాదేవి, ఇమాంబీ, శారద, రమణ, సారమ్మ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

తెనాలి రూరల్: మండల పరిధిలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు బుధవారం బహూకరించారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న తలతోటి సుభాషిణి తన భర్త జోసెఫ్ జ్ఞాపకార్థం 25 మంది క్రీడాకారులైన విద్యార్థులకు దుస్తులు అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.అనురాధ తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛందంగా దాతలు సహకరించటం అభినందనీయమన్నారు.